

ఐదు వేల మంది మహిళలకు వృత్తి శిక్షణ



ఆచంట: స్త్రీ, శిశుఅభివృద్ధి, గ్రామాభివృద్ధికి పాటుపడుతూ వారిలో సామాజిక చైతన్యం కలిగిస్తూ సుమారు ఐదు వేల మందికి రాష్ట్రస్థాయిలో ఉచితంగా వృత్తి శిక్షణ ఇచ్చామని భీమలాపురం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళా సేవా మండల అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు, మగ్గాలు, గ్రైండర్లు, మిక్సీలు అందించినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు, ఆయా కుటుంబాల్లో చేయూతనిచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయిలో వంద అవార్డులు, 500 సన్మానాలు పొందినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్‌ఫోరం నార్త్ విభాగానికి అధ్యక్షులుగాను, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ డిప్యూటీ స్పీకర్ 201గాను, బిజిబిఎస్ ఉమెన్స్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు ఛారిటబుల్ ట్రస్ట్ ఎమ్‌డిగా అనేక పదవులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

రైతుని నిలబెట్టాలి.. వ్యవసాయాన్ని కాపాడాలి

వ్యవసాయ, ఆక్వారంగ రాష్ట్ర సదస్సు పిలుపు - సమస్యల పరిష్కారానికి రైతులు, కార్మికులు ఏకం కావాలి



మాట్లాడుతున్న సీనియర్ రైతు నేత వై.కేశవరావు

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

వ్యవసాయం, ఆక్వా రంగాలతోపాటు ఇతర అన్ని పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, వీటి మీదే ప్రధానంగా ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు, అనుబంధ కార్మికులు అనేక ఇబ్బందుల మధ్య జీవనం సాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో రైతుని నిలబెట్టుకుని.. వ్యవసాయాన్ని కాపాడాలి అని వ్యవసాయ, ఆక్వారంగ సమస్యలు, ప్రభుత్వాల విధానాలు-పరిష్కారానికి ప్రత్యామ్నాయాలు'పై రాష్ట్ర రైతు సదస్సు పిలుపునిచ్చింది. వ్యవసాయం, ఆక్వాతోపాటు ఇతర పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. సమస్యలు పరిష్కరించకపోతే రైతులు, కార్మికులు ఒకే తాటిపైకి వచ్చి పాలకులకు గుణపాఠం చెబుతామని సదస్సు స్పష్టం చేసింది. స్థానిక రైస్‌మిల్లర్స్ హాలులో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రైతు రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తలుగా ప్రముఖ రైతు నాయకులు వై.కేశవరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విచ్చేశారు. సదస్సులో తీర్మానాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ప్రవేశపెట్టారు. వ్యవసాయ, ఆక్వా రైతులతోపాటు కాయగూరలు, తమలపాకు, ఉప్పు, పండ్లు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. భవిష్యత్తులో ఈ డిమాండ్ల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సదస్సు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ముఖ్యవక్త కేశవరావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీనికి నిదర్శనం గతంలో తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలన్నారు. అప్పట్లో రైతులు ఢిల్లీలో ప్రాణాలకు తెగించి పోరాడారని, అయితే మోడీ దిగొచ్చి చట్టాలను రద్దు చేసినప్పటికీ అప్పట్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. కృష్ణా, గోదావరి జిల్లాల్లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పంటలు పండే పరిస్థితి లేదన్నారు. దీనికి ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలే కారణమన్నారు. రైతులు వేలాది కోట్ల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంతోపాటు ప్రాసెసింగ్, మార్కెటింగ్, అమ్మకం వెసులుబాటు కల్పించినప్పుడే వ్యవసాయం, ఆక్వారంగాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వం పట్టించుకోవట్లేదు

గోపాలకృష్ణంరాజు, ఆదర్శ రైతు, యండగండి



నాలుగేళ్లుగా నుంచి అధిక వర్షాలతో పంట నష్టపోయాం. ప్రభుత్వాన్ని, అధికారులను, వివరాల ఓట్లు వేయించుకుని గెలుపొందిన ఎంఎల్ఎలుగాని మావైపు కన్నెత్తి చూడలేదు. కలెక్టర్, తహశీల్దార్లకు చెప్పినా ఫలితం లేదు. రైతులకు అవసరమైన మురుగుకోడలు, కాలువలు బాగుచేసే లేదు. మద్దతు ధర ఇవ్వట్లేదు. ఉండి ఎంఎల్ఎ రామరాజు కనీసం రైతులను ఈ నాలుగేళ్లలో పలకరించలేదు. రైతుల పక్షాన అండగా నిలబడుతున్న సిపిఎంకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

ఆస్తులు అమ్ముకుంటున్నాం

యువరాజు, ఆదర్శ రైతు, కలిగొట్ల



వరి రైతుల పరిస్థితి దయనీయం. ఇక మా ఆక్వా రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. న్యాయమైన సీడ్ దొరకట్లేదు, ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. సరైన ధర ఉండట్లేదు. తీవ్ర నష్టాలు వచ్చి అప్పుల పాలయ్యాం. ప్రస్తుతం ఆస్తులు అమ్ముకుంటున్నాం. ఈ పరిస్థితికి కారణం ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలే. ఈ విధానాలను ప్రశ్నించకపోతే భవిష్యత్తులో మరింత ప్రమాదం ఏర్పడుతుంది. ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎంకు అంతా మద్దతు ప్రకటించాలి. అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి.

రైతాంగం పట్ల పార్టీల విధానం స్పష్టం చేయాలి

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



బిజెపి, వైసిపి, గతంలో పాలించిన టిడిపి సైతం వ్యవసాయం పట్ల సరైన విధానం అవలంబించలేదు. ధనిక రైతులు ఎంతోకొంత బాగు పడ్డారు. మిగిలిన సన్న, చిన్నకారు రైతులంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. 70 ఏళ్ల రాజకీయ వ్యవస్థలో పాలించిన అన్ని పార్టీలూ కార్పొరేట్ వ్యవస్థకు పట్టంగట్టారు. రూ.12 లక్షల కోట్ల రుణాలను కార్పొరేట్లకు రద్దు చేశారు. 13 జిల్లాల్లో 400 కరువు మండలాలు ఉన్నా ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. ప్రత్యామ్నాయ విధానాన్ని సిపిఎం ప్రకటిస్తోంది. రైతాంగం పట్ల మిగిలిన పార్టీల వైఖరి ఏమిటో చెప్పాలి.

కౌలురైతుల పరిస్థితి మరింత దారుణం

రామాంజనేయులు, కౌలు రైతుల జిల్లా నాయకులు



వ్యవసాయ సాగులో ఉన్నది ఎక్కువ శాతం కౌలురైతులే. ప్రస్తుతం వీరి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కౌలుగుర్తింపు కార్డుల జారీలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూయజమాని ఒప్పుకోకపోవడంతో పూర్తిస్థాయిలో కార్డులు అందట్లేదు. దీంతో సకాలంలో రుణాలు అందక కౌలు రైతులు కుంగిపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కౌలు రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

రాజకీయాలకు అతీతంగా పోరాడాలి

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



రైతుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ఎలా చెప్పినా.. ఎంత చెప్పినా వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పాలకుల విధానాలతో వ్యవసాయరంగం సంక్షోభంలో పడింది. భవిష్యత్తులో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. వ్యవసాయాన్ని కాపాడుకుని రైతుల్ని నిలబెట్టే బాధ్యత మనందరిపై ఉంది. దీనికోసం రాజకీయాలకు అతీతంగా కచ్చితంగా పోరాడాలి.

అభివృద్ధి అంటే ఇదేనా

డి.కళ్యాణి, గ్రామీణ మహిళా జిల్లా నాయకులు



దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని మోడీ గొప్పలు చెబుతున్నారు. నూటికి 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయానికి తోడ్పాటు అందించకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తినడానికి తిండి లేక మృత్యువాత పడుతున్నారు. ఇదేనా అభివృద్ధి అంటే.. మోడీ ఆలోచించుకోవాలి. రైతుల గోడు వినే నాథుడు కరువయ్యాడు. రైతుల సమస్యలపై నిరంతరం ఐక్య పోరాటాలు చేయాలి.

ప్రభుత్వానిది కంటితుడుపు చర్య

కవురు పెద్దిరాజు, జిల్లా రైతు నాయకులు



కిసాన్ యోజన కింద రూ.6 వేలు, రైతుభరోసా ద్వారా రూ.7 వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. రోజుకి కేవలం రూ.12 మాత్రమే అందిస్తుంది. రైతులే అభివృద్ధి సాధించటం అంటే ఇదేనా ప్రభుత్వం చెప్పాలి. చేదోడు కింద రూ.18,500ను ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం సంక్షేమానికి వేస్తున్న పెద్దపీట అభివృద్ధికి వేయట్లేదు. ప్రజలకు, రైతులకు అందిస్తుంది కేవలం కంటితుడుపు చర్య.

ప్రభుత్వం చేతివృత్తులను నాశనం చేసింది

జుత్తిగ నరసింహామూర్తి, చేతివృత్తుల రాష్ట్ర నాయకులు



పూర్వకాలం నుంచి చేతివృత్తులు ఉన్నాయి. వీటిని ప్రభుత్వం కులాల పేరుతో నాశనం చేసింది. చేనేత కార్మికులు అనేక ఇబ్బందులతో ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వృత్తిదారులు సమస్యలతో సతమతమవుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక వృత్తులను మరింత నిర్వీర్యం చేసింది. సిపిఎం నిరంతరం చేతివృత్తిదారుల సమస్యలపై పోరాడుతుంది. రానున్న కాలంలో సమస్యల పరిష్కారానికి అంతా కలిసి ముందుకు సాగాలి.

సాగు క్రమేపీ తగ్గుతోంది

ఆకుల హరేరాం, జిల్లా రైతు నాయకులు



గతంలో జిల్లాలో రెండు లక్షల 40 వేల ఎకరాల్లో వరి సాగయ్యేది. ఈ రెండు, మూడేళ్లలో సుమారు పది శాతం క్రమేపీ సాగు తగ్గుతూ వస్తోంది. లక్షా 80 వేల ఎకరాల్లో ఉన్న ఆక్వా సాగు సగానికిపైగా తగ్గింది. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలే దీనికి ప్రధాన కారణం. రైతులు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు సాగు చేసేందుకు ముందుకు రావట్లేదు. మొత్తం అందించే సాయం రుణాలు కూడా సక్రమంగా అందించిన దాఖలాల్లేవు.

సమస్యల పరిష్కారానికి కదిలి రావాలి

చింతకాయల బాబూరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



అన్ని పంటల రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్యల పరిష్కారానికి అంతా కలిసి రావాలి. వ్యవసాయాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నారు. ఆక్వా రంగ పరిస్థితీ ఇలానే ఉంది. సరైన ధర లేక రొయ్యలు, చేపలు అయినకాడికి అమ్ముకుంటున్నారు. నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం సాగునీరు కోసం ఏమీ ఖర్చు చేయలేదు. రైతాంగం పట్ల ప్రభుత్వానికి అంత శ్రద్ధ ఉంది.

వ్యవసాయ, ఆక్వారంగాలపై పాలకులకు శ్రద్ధ లేదు

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి



వ్యవసాయం, ఆక్వా రంగాలపై పాలకులకు ఎటువంటి శ్రద్ధా లేదు. వీటితోపాటు ఇతర పంటల రైతులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు గాలికొదిలేశాయి. సిపిఎం బాధ్యతగా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పాటుపడుతుంది. వ్యవసాయం తర్వాత ఆక్వా రంగం విస్తరించింది. ధాన్యం రైతులు శతకోటి కష్టాలుపడుతున్నారు. కొబ్బరి, ఆకు, కాయగూరలు, తమలపాకు, ఉప్పు, పండ్ల తోటల రైతులు సైతం అనేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయరంగానికి బడ్జెట్ పెంచి ఆహార భద్రత కాపాడాలి. ఆక్వా, ఇతర పంటల రైతులకు సిపిఎం అండగా ఉంటుంది.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన తప్పనిసరి : కలెక్టర్



కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సోమవారం ఎన్నికలు, రీసర్వే మ్యూటేషన్స్, స్వమిత్వ, జగనన్న కాలనీల్లో గృహనిర్మాణం, స్థలసేకరణ, స్పందన గ్రీవెన్స్, జిఇఆర్, నాడు-నేడు పనులు, వాలంటీర్ల ఖాళీలు భర్తీ, పిఎం విశ్వామిత్ర రిజిస్ట్రేషన్, పిఎం ఆయుష్మాన్‌భవ కార్డులు, రీసర్వే, ఎన్‌ఆర్‌ఇజిఎస్ తదితర అంశాలపై మండలాలవారీ సంబంధిత డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల నేపథ్యంలో మండలాల్లో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారా అని అడిగి తెలుసుకున్నారు. జాబితాలో ఏవైనా క్లైయిమ్స్, అభ్యంతరాలు వచ్చి ఉంటే వాటిని మీటింగ్ సమయంలో మినిట్స్‌లో వివరించాలన్నారు. ఓటర్ల సంఖ్య, జెండర్ రేషియో వారీగా జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని సూచించారు. బిఎల్‌ఒల వద్ద కూడా ఒక కాపీ ఉంచుకోవాల న్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఎన్నికలకు సంబంధించిన అంశాలపై పూర్తిగా నిమగ్నమై ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాల ని సూచించారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లో సమర్థవంతంగా ఎలక్ట్రోరల్ రోల్‌ను వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. స్పందన గ్రీవెన్స్‌లో 90 రోజుల్లో ఇంటి స్థలం దరఖాస్తు, మ్యూటేషన్స్‌పై ఎక్కువ ఫిర్యాదులు వచ్చినవే వస్తున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. మండలస్థాయిలో పరిష్కరించగలిగే ఫిర్యాదులను జిల్లాలో జరిగే స్పందనకు రాకుండా తక్షణం పరిష్కరించాలన్నారు. ఇంటర్ విద్యార్థుల డేటాను స్టూడెంట్ ఇన్ఫోలో ఇంకా అప్డేట్ చేయకపోవడంపై జిల్లా కలెక్టర్ సంబంధిత మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, ఆర్‌డిఒలు ఎం.అచ్యుత అంబరీష్, కె చెన్నయ్య, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిపిఒ జివికె.మల్లికార్జున రావు, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనంద కుమార్, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్‌ఖాన్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపరూ..

తహశీల్దార్‌కు లబ్ధిదారుల వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

జగనన్న లేఅవుట్‌లో తమకు కేటాయించిన స్థలాలను స్వాధీనపర్చాలని తోలేరు ఉత్తరపాలేనికి చెందిన లబ్ధిదారులు తహశీల్దార్ సుందర్రాజుకు సోమవారం వినతి అందజేశారు. ప్రభుత్వం పట్టాలు అందజేసి రోజులు గడుస్తున్నా ఇంతవరకు తమకు కేటాయించిన స్థలాలు ఎక్కడో తెలియదన్నారు. అయితే స్థల కేటాయింపు సమయంలో తమను ఫొటోలు తీసింది ఒక చోటైతే, ఇప్పుడు స్థలాలు మరో ఉన్నాయని అధికారులు చెబుతుండటంతో లబ్ధిదారులు గందరగోళంలో పడ్డారు. దీంతో వారు తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ వీరికి బుధారాయుడుచెరువు ప్రాంతంలో సర్వే నెం.392 లేఅవుట్‌లో స్థలాలు కేటాయించామని, త్వరలోనే వారి స్థలాలను వారికి స్వాధీనం చేస్తామని చెప్పారు. లోలెవెల్‌గా ఉన్న స్థలాన్ని మెరక చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జనసేన నాయకుడు గుండా రామకృష్ణ, టిడిపి మండలాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ శ్రీరామచంద్రమూర్తి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సాంకేతిక విద్య ద్వారా విద్యార్థులు ఉద్యోగం సంపాదించుకోవడం కాదని, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ప్రముఖ స్టార్టప్ కంపెనీ క్యారీ కేర్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు ఎం.పవన్‌కుమార్‌వర్మ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైనింగ్, ఎఐసిటిఇ ఐడియా ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో అటల్ ఇన్నోవేషన్ సెంటర్ సహకారంతో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ పేరిట వారం రోజులపాటు జరిగే జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి సిఎస్‌డి హెడ్ డాక్టర్ ఎం.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఒక ఆలోచన వస్తే దానికి ఒక సొల్యూషన్ తీసుకువచ్చి వాస్తవ రూపంలో అమలు చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ప్రధాని ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక రూపాల్లో అండగా నిలుస్తుందన్నారు. దీనిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. తమ కళాశాలలో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్స్‌తోపాటు విద్యార్థులు స్టార్టప్స్ ఏర్పాటు చేసేందుకూ వసతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధి కిరణ్‌కుమార్‌వర్మ మాట్లాడుతూ ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో దాదాపు 15 మంది వరకు శిక్షణ పొందటం, స్టార్టప్‌లు ప్రారంభించడం వంటి టెక్నాలజీ అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, కళాశాల ఆర్అండ్‌డి డీన్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, సిఎస్‌డి విభాగం హెడ్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

దళితుల శ్మశాన ఇబ్బందులను పట్టించుకోరా

భూస్వాముల చేతుల్లోని భూములను వెలికితీయండి

కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ధర్నాలో మాజీ ఎంఎల్ఎ రాజగోపాల్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న దిగుపాటి రాజగోపాల్

భీమవరం: జిల్లావ్యాప్తంగా అన్ని దళిత పేటలకు రెండెకరాలు శ్మశాన స్థలం కేటాయించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితుల శ్మశానవాటిక, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, తాగునీరు వంటి సమస్యలపై ధర్నా నిర్వహించారు. ధర్నాకు సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ దళితపేటల్లో శ్మశానం లేక అనేక ఇబ్బందులు పడుతుంటే అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని కనీసం పట్టించుకోవడం లేదన్నారు. బతికినంత కాలం కులవివక్ష ఎదుర్కొనే దళితులు ఆఖరి మజిలీలోనూ వివక్షను ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమన్నారు. జిల్లాలో 75 శాతం దళితపేటలకు సరైన శ్మశానవాటిక లేదని తెలిపారు. జిఒ నెం.1235 ప్రకారం ప్రతి దళితపేటకు రెండెకరాలు భూమిని శ్మశానవాటికగా కేటాయించాలని డిమాండ్ చేశారు. పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామంలో దళితులు, బిసి, బేడ బుడగ జంగాల కులాలకు చెందిన పేదలకు అన్యాయంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయకుండా నిలిపివేయడం దారుణమన్నారు. అగ్రకుల భూస్వామి ఉద్దేశపూర్వకంగా రాజకీయ ప్రోద్బలంతో పట్టాలు నిలుపుదల చేస్తే అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సామాజిక న్యాయం పేరుతో బస్సు యాత్ర చేసే మంత్రులకు అదే సామాజిక న్యాయంలో భాగమైన ఎస్‌సి, బిసిలు అన్యాయమైపోతుంటే కనీసం పట్టించుకోరా అని ప్రశ్నించారు. దళిత, బిసిల హక్కులను కాలరాసి యాత్రలు చేయడం అంటే వారిని మోసం చేయడమేనన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ గత నెలలో కెవిపిఎస్ ఆధ్వర్యాన చేపట్టిన దళిత రక్షణ యాత్రలో దళితులు ఎదుర్కొనే అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. దళితులకు కొన్నిచోట్ల శ్మశానాలు ఉన్నాసరే అవి సరిపోక పాత భౌతికకాయాల అవశేషాలను తవ్వి కొత్త భౌతికకాయాలను పూడ్చి పెట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. శ్మశాన స్థలం కేటాయింపునకు జిఒ నెం.1235 ప్రకారం రెండెకరాలు భూమి ఇవ్వాలని, ప్రభుత్వ భూమి లేకపోతే అవసరమైతే కొనుగోలు చేసి ఇవ్వాలని జిఒ 1235 చెబుతుందన్నారు. అయితే దాని అమలు జాడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం శ్మశాన వాటికల కేటాయింపునకు కొత్త ఆదేశాలిచ్చినా మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. శ్మశాన వాటికల సమస్యను ఎదుర్కొనే గణపవరం మండలం అర్ధవరంలో దళితపేట, పెనుమంట్ర మండలం జుత్తిగలో దళిత పేటలకు తక్షణం శ్మశానవాటిక భూములను కేటాయించి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉండి మండలం పాందువ్వలోని దళితపేటలో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలో దళితపేటల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం లేకపోవడం, నేటికీ తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం అత్యంత వివక్ష పూరితమన్నారు. పాలకోడేరు మండలం మోగల్లులో అంబేద్కర్ పేటకు డ్రెయినేజీ మంజూరై సుమారు నాలుగేళ్లు దాటిందని, నేటికీ ఆ నిర్మాణం ప్రారంభం కాలేదని తెలిపారు. దళితుల సమస్యలను పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని ఆరోపించారు. దళితుల సమస్యలపై జిల్లా అధికారులు తక్షణం స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు కెవిపిఎస్ బృందం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా జెసి సుందరరామిరెడ్డి స్పందిస్తూ జిల్లాలో శ్మశానవాటిక లేని గ్రామాలను లిస్ట్ చేసి వాటికి భూములను కేటాయించేలా కృషి చేస్తామన్నారు. సగంచెరువు పేదలకు ఇళ్ల పట్టాల భూమిని పరిశీలించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు చిన్నం చిననాగేశ్వరరావు, మాదాసు గోపి, కప్పల రత్నంరాజు, నేతలు కండెల్లి కృష్ణ, పి.శ్యాంబాబు, కుచ్చనపల్లి ఏసురత్నం, దళితులు పాల్గొన్నారు.

దిగుబడిపై దిగాలు..!

సరైన వర్షాలులేక ఆశాజనకంగా లేని వరిపంట
తెల్ల కంకులు ఎక్కువగా వస్తున్న దుస్థితి
ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడి
దిగుబడి తగ్గుదలతో పెట్టుబడి సొమ్మూ కష్టమే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ దిగుబడులపై అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి రావడమే గగనం అన్నట్లు రైతులు భావిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం సకాలంలో వర్షాలు పడకపోవడమేనని రైతులు చెబుతున్నారు. వర్షాలు లేకపోవడంతో తెల్ల కంక్కులు ఎక్కువగా వస్తున్నాయని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టడంతో అన్నదాత లోలోన గుబులు చెందుతున్నారు. ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఈ ఏడాది సరైన వర్షాలు కురవని దుస్థితి నెలకొంది. వర్షాకాలం నాలుగు నెలల్లో ఒక్క జులై మినహా మిగిలిన మూడు నెలల్లోనూ లోటు వర్షపాతమే నమోదైంది. మెట్ట ప్రాంతంలోని పలు మండలాల్లో వర్షాలు లేక పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వరి పొలాలు ఆశాజనకంగా తయారు కాలేదు. ప్రస్తుతం పొలాలన్నీ ఈనిక దశలో ఉన్నాయి. ప్రతి దుబ్బులోనూ ఒకటి, రెండు తెల్ల కంకులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈనిక పూర్తయ్యేసరికి తెల్లకంకుల శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే ఎకరాకు 40 బస్తాల వరకూ దిగుబడి రావాల్సి ఉండగా 30 బస్తాలు రావడమే గగనం అన్నట్లుగా ఉందని రైతుల అంచనా. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టామని, దిగుబడి తగ్గితే తీవ్ర నష్టాలు తప్పవని అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. ఖరీఫ్ సాగు ఆది నుంచి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. సరైన వర్షాలు లేక సాగునీటి కోసం రైతులు నానాతంటాలు పడ్డారు. వర్షాలు కురవకపోవడంతో ఎరువులు, పురుగుమందులు అత్యధికంగా ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎలుకల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అన్ని అడ్డంకులూ దాటుకుని ఈనిక దశలో తెల్లకంకులు వస్తుండటంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే కోతల సమయంలో వర్షాలు కురిసే ప్రమాదం ఉందని రైతులు భావిస్తున్నారు. అదే జరిగితే అన్నదాతకు కోలుకోలేని దెబ్బ తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా వస్తేనే రైతులకు రబీలో కాస్తాకూస్తో ఖర్చులకు వచ్చే అవకాశం ఉంటుంది. ఖరీఫ్ దిగుబడులు తగ్గితే రబీలోనూ రైతులకు నష్టాలు తప్పవని చెప్పొచ్చు. మరో 20 రోజుల్లో ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభం కానున్నాయి. దీంతో దిగుబడులు ఏ విధంగా వస్తాయోననే భయం అన్నదాతను వెంటాడుతోంది.

వర్షాల్లేక దెబ్బతిన్న పంటలు

ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో వరి, పత్తి పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. మెట్టప్రాంతంలో వర్షాభావంతో సాగు చేసిన పంటలు ఎండిపోయిన పరిస్థితి ఉంది. చింతలపూడి, చాట్రాయి వంటి మండలాల్లో పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఉన్న పంటలు సైతం దిగుబడి ఏ విధంగా వస్తాయోననే భయంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారం అంచనాలు నమోదు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి చలనమూ లేకపోవడంతో రైతులు గుబులు చెందుతున్నారు. బీమాతోపాటు, పంట నష్టపరిహారం ఇచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకుంటేనే రైతులు కోలుకునే పరిస్థితి ఉంటుంది.


ఆకివీడులో నిరసన ప్రదర్శన

అరాచకాలను అరికట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆకివీడు

ఇటీవల కాలంలో పట్టణంలో రౌడీ మూకల అరాచకాలు, అక్రమాలు పెరిగిపోయాయని, వాటిని వెంటనే అరికట్టాలని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు డిమాండ్ చేశారు. ఇటీవల మూడు రోజుల క్రితం స్థానిక బజారు ముఠా కార్మికులపై తెలగాపాలెం యువకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ కార్మికులు వారి కుటుంబసభ్యులు, సిఐటియు కార్యకర్తలు, నాయకులు సోమవారం పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్మిక నాయకులు బి.అప్పలనాయుడు, యు.రమణ, మణిపూరి, సత్యం, అచ్యయ్య, నెల్లి సూరిబాబు, పంపన రమణ, ప్రజాసంఘాల నాయకులు డోకల రవితేజ, బి.వర్మ, బి.రాంబాబు, ఎల్.అలరాం, వి.సత్యవతి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ఆకివీడులో ముఠా కార్మికులపై దాడి చేసిన రౌడీ మూకలపై హత్యాయత్నం కేసులు పెట్టి అరెస్టు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎస్‌పికి వినతిపత్రం అందించారు. సిఐటియు బృందం బాధిత కుటుంబాలను ఎస్‌పిని కలిసింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పిని కోరారు. దీనిపై స్పందించిన ఎస్‌పి మాట్లాడుతూ అన్ని విషయాలు తమ దృష్టికి ఉన్నాయని, దాడికి పాల్పడిన వారిని గుర్తించామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డి.రవితేజ, బి.రాంబాబు, ఎం.వైకుంఠరావు ఉన్నారు.

పలు గ్రామాల్లో గ్రామసభలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉపాధి హామీ చట్టం ద్వారా భవనాలు, రోడ్లు, డ్రైనేజీ, మొక్కలు, పంచాయతీ చెరువుల వంటి అభివృద్ధి పనులు చేసుకోవచ్చని మాముడూరు సర్పంచి గూడూరి దేవేంద్రుడు అన్నారు. మండలంలోని మాముడూరు, పొలమూరు గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాముడూరులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి దేవేంద్రుడు, పొలమూరులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు మాట్లాడారు.

రెడ్‌క్రాస్ సంస్థ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - భీమవరం రూరల్


ఫ్లవర్ డే వేడుకలు

రెడ్‌క్రాస్ భీమవరం పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనెట్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. జిల్లా ఛైర్మన్ వీరావఝలరావు మాట్లాడుతూ 1901 ప్రపంచ శాంతి నోబెల్ ప్రైజ్ అందుకున్న సంస్థ రెడ్ క్రాస్ అని అంతేకాకుండా అనుక్షణం మానవతా కోణంలో పనిచేసే సంస్థ అని అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రక్తదానం అవశ్యకతను, అవసరదాన తీర్మలంలో రెడ్ క్రాస్ సేవలు ఎనలేనివని కొనియాడారు. సంస్థ రెడ్ క్రాస్ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళీకృష్ణారావు మాట్లాడుతూ విపత్తుల సమయంలో రెడ్ క్రాస్ అందించే సేవలు ఎనలేనివని అన్నారు.

పాలకొల్లు మాంటిస్సోరిలో ఫ్లవర్ డే

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక లబదిశాయ్ పేట మాంటిస్సోరి స్కూల్లో సోమవారం విద్యార్థులు ఫ్లవర్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రకృతి అత్యంత రమణీయంగా, శోభాయమానంగా ఉంచడమే కాకుండా పచ్చగా ఉంచాలనే భావన కలిగించడం ద్వారా, వాతావరణ సమతుల్యాన్ని ఏర్పరచడానికి ఉద్దేశించిందే ఈ ఫ్లవర్ డే అని స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ కె.కృష్ణవర్మ అన్నారు. ఈ ప్రకృతిలో వివిధ రకాల పూలు, అనేక ఔషధ గుణాలను కలిగి, సువాసనను వెదజల్లుతూ ప్రకృతికి శోభ చేకూర్చుతూ మానవాళికి ఎంతగానో మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పూలతో పాఠశాల ప్రాంగణంలో పూల మొక్కలు నాటారు. పాఠశాల బయాలజీ టీచర్ రాజేశ్వరి మాట్లాడుతూ వివిధ రకాలైన పూల విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. మొక్కల వల్ల కలిగే ప్రయోజనాల గురించి కూడా వారిని చైతన్యవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్‌ఎస్‌వి.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

మత్స్యపురి మెయిన్ పాఠశాల విద్యార్థులకు భోజనం చేసేందుకు దాతల సహకారంతో స్టీలు కంచాలు సమకూర్చారు. ఈ మేరకు కంచాలను దాత చల్లా శ్రీనివాస్, లక్ష్మీకిరణ్ దంపతులు ప్రధానోపాధ్యాయులు ఎంవిడి.శ్రీనివాస్ సోమవారం అందించారు. శ్రీనివాస్ కుమారుడు వంశీసాయికృష్ణ జ్ఞాపకార్థం సుమారు రూ.15 వేల విలువైన రూ.50 కంచాలను విద్యార్థుల భోజనం చేసేందుకు అందించారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

పంట కాలవ పక్కన అక్రమ నిర్మాణాలు తొలగించాలని పెనుగొండ రైతులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎస్‌వికెపి కాలేజ్ సెంటర్ వద్ద పంట కాలవ పక్కన సురభి కాంప్లెక్సు నిర్మించారన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, అనధికారంగా నిర్మించిన తుర్రను తొలగించాలని కోరారు. పలు పంటలు దెబ్బతింటున్నాయని, నీరు కలుషితమవుతుందని ఆ నీటిని తాగిన గేదెలు, ఆవులు చనిపోతున్నాయన్నారు. భూసారం దెబ్బతింటుందని పంట దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. స్పందించిన ఎంపిడిఒ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుర్గాపురంలో ఉపాధ్యాయునిపై దాడి

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థల వివాదంలో స్థానికులు తనపై దాడి చేశారని స్థానిక దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ బాబూజీ సాహెబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న స్థలంలో కొంత భాగం తమదంటూ గతంలో హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు రావడంతో స్థానిక ప్రజలు ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా వారు వెళ్లిపోయారు. ఈ క్రమంలో వారు ఆదివారం వచ్చి రాళ్లు పాతేందుకు ప్రయత్నించారు. ఇందులో తన ప్రమేయం ఉందని, స్థానికులు తనపై దాడి చేశారని ఆయన 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చినవారు పాఠశాల స్థలంలో రాళ్లు పాతుకునేందుకు ప్రధానోపాధ్యాయులు సాయం చేస్తున్నారని, దీనిపై ఆయనను అడిగామే తప్ప దాడి చేయలేదని స్థానికులు చెబుతున్నారు. దాడికి గురైన ప్రధానోపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పాఠశాలకు వచ్చిన పోలీసులు తెలిపారు. దీంతో స్థానికులు పాఠశాల వద్ద టెంట్ వేసి తమపై అక్రమ కేసులు పెట్టి అక్రమార్కులకు అండగా నిలుస్తున్న బాబూజీ మాస్టర్‌ని తక్షణమే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.

నేరాలు - ఘోరాలు

పేకాటాడుతున్న ఎఆర్ కానిస్టేబుల్ సస్పెండ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేకాటాడుతూ పట్టుబడిన ఎఆర్ కానిస్టేబుల్ బి.విజయ్‌కుమార్ సస్పెండ్ అయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంట్లో పేకాటడుతున్నారన్న సమాచారం మేరకు సిఐ అడబాల శ్రీనివాస్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఎఆర్ కానిస్టేబుల్ బి.విజయ్ కుమార్‌తో పాటు మరో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.32,660 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎఆర్ కానిస్టేబుల్‌ను ఎస్‌పి సస్పెండ్ చేశారు.

సహకార బ్యాంకులో ఉద్యోగుల చేతివాటం

రూ.కోట్లల్లో సొమ్ము స్వాహా
గుర్తించింది రూ.62 లక్షలు
విచారణ ప్రారంభించిన ఉన్నతాధికారులు

ఉండి : సహకార బ్యాంకులో ఉద్యోగులు ఆ బ్యాంకుకే శఠగోపం పెట్టిన వైనం ఎంతో చరిత్ర కలిగిన ఉండి విశాల పరపతి సహకార సంఘంలో చోటు చేసుకుంది. సుమారు ఏడు వేల మంది ఖాతాదారులు ఉన్న ఉండి సహకార బ్యాంకులో గోల్డ్ లోన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూపంలో కొన్నేళ్ల నుంచి బ్యాంకు లావాదేవీలు జరుపుతున్నారు. గతంలో బంగారం మీద అప్పు తీసుకున్న ఖాతాదారులు తిరిగి గోల్డ్ లోన్ చెల్లించి తమ బంగారాన్ని తీసుకునేందుకు ఇటీవల బ్యాంకుకు వెళ్లారు. వారి బంగారం తిరిగి ఇచ్చేందుకు బ్యాంకు సిబ్బంది రోజుల తరబడి తిప్పడంతో ఖాతాదారులకు అనుమానం వచ్చి బ్యాంక్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అనుమానం వచ్చిన బ్యాంక్ ఛైర్మన్ విచారణ జరపగా బ్యాంకులో అవకతవకలు జరిగినట్లు గుర్తించి వారిని హెచ్చరించి నగదు తిరిగి చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు సిబ్బంది నగదు చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని బ్యాంకు ఛైర్మన్ త్రిసభ్య కమిటీని కోరారు. వారికి ఇచ్చిన గడువు పూర్తయింది. సిబ్బంది చేతివాటంపై డిసిసిబి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ ప్రారంభించి బ్యాంకులో ఉద్యోగుల చేతివాటం ప్రస్తావించి అవకతవకలు జరిపినట్లు గుర్తించారు. దీనిపై విచారణ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంకులో ప్రస్తుతం జరిపిన విచారణలో రూ.62 లక్షల మేర అవకతవకలు గుర్తించామని, మరిన్ని అవకతవకలు జరిగినట్టు కూడా గుర్తించామని, ఈ కుంభకోణం రూ.కోట్లలో ఉండే అవకాశం ఉందని, పూర్తిస్థాయిలో విచారణ అనంతరం ఎంత మేర కుంభకోణం జరిగిందనే వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

శ్రీనివాస్‌కు జాతీయస్థాయి ఉత్తమ కవితా పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

నెల్లూరుకు చెందిన కోసూరు రత్నం ఛారిటబుల్ ట్రస్ట్, విశాలాక్షి సాహిత్య మాసపత్రిక సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీల్లో పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ సహాయ కార్యదర్శి ప్రముఖ కవి మామిడిశెట్టి శ్రీనివాస్ రచించిన నగ్న రుధిర పుష్పాలు కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ఆదివారం రాత్రి నెల్లూరు టౌన్ హాలులో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో 25 కళాసంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి, ప్రముఖ వైద్యులు జయప్రద, ప్రముఖ రచయిత విమర్శకులు ఎవి.రామిరెడ్డి, విశాలాక్షి సాహిత్య మాసపత్రిక సంపాదకులు ఈతకోట సుబ్బారావు, కోసూరు రత్నం, పలువురి పెద్దల చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను డొక్కిపట్ల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది, రసధుని సాహితీ సంస్థ అధ్యక్షులు కొల్లి భాస్కరరావు, ఎన్‌జిఒ నాయకులు పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

రంగరాజు మాస్టర్‌కు జాతీయ పురస్కారం

ఉండి : మండలంలోని చెరుకువాడకు చెందిన సాహితీవేత్త, కవి, ప్రముఖ కార్టూనిస్ట్, లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు మాస్టర్‌కు జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల నెల్లూరులో జరిగిన విశాలాక్షి వృద్ధాశ్రమం, విశాలాక్షి మాస పత్రిక వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీలో ఉత్తమ కార్టూనిస్ట్‌గా రంగరాజు జాతీయ పురస్కారం అందుకున్నారు. 64 కళల సంఘం అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు రంగరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రముఖ రచయిత్రి, వైద్యులు డాక్టర్ జయప్రద, ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకులు ఎవి.రామిరెడ్డి, విశాలాక్షి సంపాదకులు సుబ్బారావు, ఆత్మకూరువ్యవస్థాపకులు కోసూరు రత్నం, రచయిత చిన్ని నారాయణరావు, రచయిత చంద్రశేఖరశర్మ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు.

స్టాంపు ఫీజు తగ్గించే వరకూ విధుల బహిష్కరణ

భీమవరం బార్ అసోసియేషన్ ట్రెజరర్ అశోక్‌బాబు

భీమవరం రూరల్ : పెంచిన రూ.20 వెల్ఫేర్ స్టాంపు ఫీజు రద్దు చేసే వరకు విధులను బహిష్కరిస్తామని భీమవరం బార్ అసోసియేషన్ ట్రెజరర్ అశోక్ బాబు తెలిపారు. హైకోర్టు బార్ కౌన్సిల్ కింది కోర్టులతో సంప్రదించకుండా వెల్ఫేర్ స్టాంపు ఫీజును రూపాయి నుంచి రూ.20 పెంచి వేసింద న్నారు. దీనిని వ్యతిరేకిస్తూ గత 25 రోజులుగా కోర్టు విధు లను బహిష్కరిస్తున్నట్లు భీమవరం బార్ అసోసియేషన్ ట్రెజ రర్ బడుగు అశోక్‌బాబు సోమవారం కోర్టు వద్ద న్యాయ వాదులతో కలిసి మాట్లాడారు. కక్షిదారులకు ఉచితంగా న్యాయం అందిం చాలనే నియమానికి స్టాంప్ ఫీజు పెంచడం విరుద్ధంగా, అవరో ధంగా ఉంద న్నారు. భీమవరంలో ఉన్న 700 మంది న్యాయ వాదులు ఐక్యంగా పెరిగిన స్టాంపును వ్యతిరేకిస్తూ విధులను బహిష్కరిస్తున్నామన్నారు. దీంతో కోర్టుల్లో కేసులు విచారణ జరగగా వాయిదాలు పడిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా హైకోర్టు బార్ కౌన్సిల్ రాష్ట్రంలోని న్యాయ వాదుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పెంచిన వెల్ఫేర్ స్టాంపు ఫీజు తగ్గించి గతంలో లాగా రూపాయికి తీసుకు రావాలన్నారు. రూ.21తో స్టాంపు ప్రతి పిటీషన్ మీద అం దించాలంటే కక్షిదారులపైన న్యాయవాదు లపైన అదనపు భారం పడుతుందన్నారు. ఈ నెల 31 వరకు తమ విధులు బహిష్కరిస్తున్నామని స్టాంపు ఫీజు తగ్గించకపోతే నవంబర్ ఒకటో తేదీ నుంచి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇంటి సురేష్, నండూరి రఘు, రావూరి రాజేష్, వి.సాయి, పి.కుమార్, కె.భీమరావు. కె.శీనివాస్, డి.విల్లింగ్ స్టన్, అరవింద్ ఘోష్ పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి


ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ధరఖాస్తులను కలెక్టర్ జెసి రామ్‌సుందర్‌రెడ్డితతో కలిసి అందు కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కానాల సంగీత్ మాధుర్, పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : భీమవరం సబ్ డివిజనల్ పోలీసు అధికార కార్యాలయంలో ఎస్‌పి యు.రవిప్రకాష్, ఎఎస్‌పి సుబ్బరాజులు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 18 ఫిర్యాదుదారులు వచ్చి ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఎక్కువగా వరకట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదలపై ఫిర్యాదులు ఇచ్చారు. సత్వరమే ఫిర్యాదులన్నిటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఎస్‌పి ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు.

ఆర్‌బికెల్లో ఇ-క్రాప్ ముసాయిదా జాబితా ప్రచురణ

ప్రజాశక్తి - ఆచంట


ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రచురిస్తున్న సర్పంచి

సామాజిక తనిఖీ, గ్రామసభల అనంతరం ఇ-క్రాప్ జాబితాలను అన్ని ఆర్‌బికె కేంద్రాల్లో ప్రచురిస్తున్నట్లు మండల వ్యవసాయ విస్తరణాధికారి బి.నాగరాజు తెలిపారు. పంట నమోదు గ్రామసభల నిర్వహ ణ కార్యక్రమాన్ని సర్పంచి సుంకర సీతారామ్ అధ్యక్షతన సోమవారం రైతు భరోసా కేంద్రంలో నిర్వహించారు. 2023 ఖరీఫ్ పంటకు సంబంధించి ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రచురించినట్లు ఎఇఒ తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం మండలంలో 15 రైతు భరోసా కేంద్రాల వద్ద ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసభలు నిర్వహి ంచినట్లు తెలిపారు. సర్పంచి సుంకర సీతారామ్ మాట్లా డారు. ఈ కార్యక్రమంలో విఎఎ, విహెచ్‌ఎ, రైతులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా అప్పారావు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బివివి.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సూపరింటెండెంట్ ఉమామహేశ్వరావుకు మండల అభివృద్ధి అధికారిగా ఉద్యోగోన్నతి రావడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. భీమవరం ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అప్పారావు ఉద్యోగోన్నతితో ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎంపిపి వీరవల్లి దుర్గాభవానిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నిబద్ధతతో పని చేసే ప్రతి అధికారికి తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో చురుకుగా ఉండాలని సూచించారు.

ప్రజారోగ్యానికి జగన్ పెద్దపీట : మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


పాలకోడేరు : కిట్లు అందిస్తున్న పివిఎల్.నరసింహరాజు

రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని సిఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలిచిందనపి దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక కడకట్ల కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. మంత్రి కొట్టు ఈ శిబిరాన్ని సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు.

పాలకోడేరు : పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం సొంతమవుతుందని ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వాణివిజయరత్నం అన్నారు. మండలంలోని గరగపర్రులో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు పలు సూచనలు, సలహాలు అందించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తుందన్నారు. సుమారు నెల రోజుల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని మరో 15 రోజులు పాటు కొనసాగుతుందని చెప్పారు. ఈ క్యాంపులో ముఖ్యంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టాల్స్ ఏర్పాటుకు అవసరమైన నిధులు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఈ నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రభుత్వం రూ.3 వేలు పెన్షన్ అందించనుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని గరగపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉప సర్పంచి తోకల సునీత సాల్మన్ రాజు, వైసిపి గ్రామ నేతల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.

గణపవరం : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోమర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గ్రామ సర్పంచి కేశవరపు శైలజ అధ్యక్షత వహించారు.

'వైసిపిది అప్రజాస్వామిక పాలన'

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ప్రభుత్వం అప్రజాస్వామిక, దుర్మార్గ పాలన కొనసాగిస్తుందని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిరసనగా ఆచంటలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 48వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సూర్య కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి దుర్మార్గమైన ఆలోచనతో పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కేతా మీరయ్య, నెక్కంటి ప్రభాకరరావు, సీతారాం, బీరా నరసింహమూర్తి, తమ్మినీడి ప్రసాద్, కేత మురళి, దొంగ నాగార్జున, కనపాల వెంకటేశ్వరరావు, పుల్లారావు, కిరణ్, ఆనందరావు, బాలాజీ, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాని, దుర్గారావు పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 48వ రోజుకు చేరాయి. సోమవారం దీక్షల్లో 11, 12, 16 యూనిట్ల నుంచి టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ దీక్షల వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు.

మొగల్తూరు : చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లిలో బాబుతో నేను ప్లకార్డులతో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. తొలుత గ్రామంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, జోగి పండు, కొల్లాటి బాలకృష్ణ, అడ్డల ఏడుకొండలు, దొంగ శ్రీను, కొల్లాటి తాతబ్బాయి, నాగేశ్వరరావు, మూలస్వామి, కోటేశ్వరరావు, పెంటయ్య, పెద్ద సింగ్ నాగేశ్వరరావు, బంధన విజయకుమార్, తిరుమల ఏడుకొండలు ఉన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం రాత్రి టిడిపి నేతలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ కూడలిలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలిదిండి కుమార్‌బాబు, బస్వాని ఏడుకొండలు, బల్ల శ్రీను, కొల్లాటి భోగరాజు, పాల రాంబాబు, గోపాలం, పాము శ్రీధర్, వెలిది పుల్లారావు, కడలి చంటి, పితాని శేఖర్, కారుమూరి రాజా పండు ఉన్నారు.

జాతీయస్థాయిలో చరణ్‌పవన్‌సాయి ప్రతిభ

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెదపూడి చరణ్‌పవన్‌సాయి ఇటీవల చెన్నైలో సబ్ జూనియర్ మెన్ సౌత్ జోన్ ఛాంపియన్ షిప్- 2023 పోటీలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్నారు. ఈ పోటీల్లో చరణ్ పవన్ సాయి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కలిదిండి ఆనందరాజు, భరత్, సీనియర్ హాకీ క్రీడాకారులు ఆధ్వర్యంలో చరణ్ పవన్ సాయి ని సోమవారం ఘనంగా సత్కరించారు. సర్పంచి జంగం సూరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విష్ణు విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మైలవరంలోని లక్కిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ రన్నర్స్‌గా భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణ తెలిపారు. కళాశాలలో విద్యార్థులను ఆయన సోమవారం ప్రత్యేకంగా అభిమానించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావును ప్రిన్సిపల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పింఛన్లకు అర్హత వయస్సు 50 ఏళ్లకు తగ్గించాలి

భీమవరం రూరల్ : వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక సంక్షేమ పింఛన్లను రూ.ఆరు వేలకు పెంచాలని, విభిన్న ప్రతిభావంతులకు ఇచ్చే పింఛన్లు రూ.ఏడు వేలకు పెంచాలని సామాజిక సంక్షేమ పింఛన్లకు అర్హత వయస్సు రూ.50 ఏళ్లకు తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సామాజిక పెన్షనర్ల జిల్లా సదస్సు వీరమ్మ చెరువు పార్కు (బివి.రాజు పార్క్) వద్ద అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో నామన వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మోతుకూరి వెంకటరమణ, వృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ కన్వీనర్ మేళం దుర్గాప్రసాద్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడారు.